కారుణ్య మరణానికి అనుమతివ్వండి

- కలెక్టర్, ఎస్పీకి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మహేందర్ భార్య జ్యోతి వినతి
- తన భర్త వేరొక మహిళ తో సంబంధం పెట్టుకొని తనను పట్టించుకోవడం లేదని ఆవేదన

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జ్యోతి

నల్లగొండ, డిసెంబర్ 30 : భర్త లేని జీవితం తనకొద్దని, తనకు కారుణ్య మరణానికి అనుమతివ్వాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్‌లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐగా పనిచేస్తున్న జాల మహేందర్ భార్య జ్యోతి సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు వినతి పత్రం అందజేసింది. తనను, తన ఇద్దరు పిల్లలను వదిలేసి ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బూర్గుల వసంతతో వివాహేతర సంబంధం నడుపుతున్నాడని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన జాల మహేందర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ 2010లో నార్కట్‌పల్లికి చెందిన తనను వివాహం చేసుకున్నాడని తెలిపింది. ఆ తర్వాత 2014-15లో ఎస్ఐగా ఉద్యోగం సాధించిన మహేందర్ తొలుత జిల్లా జైలులో డిప్యూటీ జైలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బూర్గుల వసంతతో పరిచయం పెంచుకున్నాడని చెప్పింది. అప్పటికే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్న వసంతతో తన భర్త వివాహేతర సంబంధం ఏర్పరుచుకొని తనను వదిలేసినట్లు ఆరోపించింది. వసంతతో శాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ తనను, తన ఐదేండ్ల కవల పిల్లలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ముగ్గురు పిల్లలు ఉన్న వసంత తన భర్త, పిల్లలతో సంతోషంగా ఉంటూ తన దగ్గరకు రానివ్వకుండా చేస్తున్నదని కన్నీరు పెట్టుకుంది. భర్త లేని జీవితం తనకు వద్దని, ఇక బతుకలేనని ఆవేదన వ్యక్తం చేస్తూ కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ పిల్లలతో కలిసి కలెక్టర్, ఎస్పీకి విన్నవించింది.

మీడియాతో మాట్లాడుతున్న వసంత

ఎస్ఐ మహేందర్ మోసం చేసి వివాహం చేసుకున్నాడు : వసంత

టాస్క్ ఫోర్స్ ఎస్ఐ జాల మహేందర్ అంతకుముందే వివాహం అయిందని తనతో చెప్పలేదని, తనను మోసం చేసి పెండ్లి చేసుకున్నాడని ఎక్సైజ్ కానిస్టేబుల్ బూర్గుల వసంత తెలిపింది. జ్యోతి కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రం అందించి విషయం తెలిపిన అనంతరం వసంత స్పందించి మీడియాతో మాట్లాడింది. మహేందర్, తనకు ఒక పాప పుట్టిన తర్వాతనే మొదటి వివాహం జరిగినట్లు ఆయన చెప్పాడని తెలిపింది. మహేందర్ తనతో ఉంటున్న సమయంలోనే జ్యోతితోపాటు వారి ఇరువురి బంధువుల సమక్షంలో పంచాయితీ పెట్టినట్లు చెప్పింది. అప్పటికి జ్యోతికి పిల్లలు లేకపోవడంతో ముగ్గురిని కలిసి ఉండాలని చెప్పారని, దీనికి మొదట్లో అంగీకరించిన జ్యోతి తనకు కవల పిల్లలు పుట్టగానే తన ఒక్కరితోనే ఉండాలని మహేందర్‌పై గొడవ చేసిందని తెలిపింది. ఆమె గత ఒప్పందాలను మరిచి పాత విషయాన్ని తవ్వి తనపై దుష్ప్రచారం చేసి తన పిల్లలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నదని, తాము ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వసంత తెలిపింది.

ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబర్ 30: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేయని వారు ప్రస్తుతం ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మదిరంలో ప్రజాల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఈ నెల 31లోపు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా వాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. సోమవారం 66 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్ఓ అమరేందర్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు ఉన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వార్డు ప్రజలు

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని అఖిలపక్ష నాయకుల వినతి

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని 13 వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్, వాటర్ ట్యాంకులు, సీసీ రోడ్ల పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, 13వ వార్డు కౌన్సిలర్ ఊట్కూరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 13 వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని, ఈ విషయమై కాంట్రాక్టర్లు పట్టించుకోవటం లేదని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టి నాణ్యత లేకుండా నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కిషన్, గుండు వెంకన్న, మేడి నర్సింహ, నిమ్మనగోటి శ్రీను, ముసుగు దశరథ, పేర్ల అశోక్, బొజ్జ వెంకన్న, పెద్దులు, యాదమ్మ, కృష్ణవేణి, ఎల్లమ్మ, వెంకటేశ్, పెరిక యాదయ్య, చాగంటి రాములు ఉన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 35 ఫిర్యాదులు

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, డిసెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు 35 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు బదలాయించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి బాధితుడి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపర్చి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల

చికిత్స పొందుతున్న సైదులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 30 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్తగూడెం మాజీ సర్పంచ్ గడ్డం జాన్‌రెడ్డి కుటుంబాన్ని సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండా సైదులును పరామర్శించారు. అనంతరం ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌తో పాటు పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారిని కోరారు. ఆయన వెంట మాడ్గులపల్లి మాజీ వైస్ ఎంపీపీ సూదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తగూడెం మాజీ సర్పంచ్ సింగం శివ, నాయకులు మెరుగు గోపి, తవిటి కృష్ణ, గాదె వివేక్‌రెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, కాకరాల వెంకట్‌రెడ్డి, బెండు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నిడమనూరు కేజీబీవీలో సిబ్బంది కోసం దరఖాస్తులు

నిడమనూరు, డిసెంబర్ 30 : నిడమనూరు కేజీబీవీలో వాచ్‌ఉమెన్, స్వీపర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు జనవరి 4లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాచ్ ఉమెన్ కోసం 10వ తరగతి పాసై ఉండాలి, 18 నుంచి 45 ఏండ్ల వయసు కలిగిన స్థానికులకు ప్రాధాన్యం ఉంటుందని, స్వీపర్ పోస్టు కోసం 7వ తరగతి పాసై 18 నుంచి 45 ఏండ్ల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు నిడమనూరు ఎమ్మార్సీలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

వంట మనిషి కోసం ..

త్రిపురారం : మండలంలోని కంపసాగర్ కేజీబీవీలో సహాయ వంట మనిషి నియామకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రమావత్ రవినాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి పాసై, 18 నుంచి 45 ఏండ్లలోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు జనవరి 4లోగా ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జనవరిలో తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్

మాట్లాడుతున్న నిర్వాహకుడు కావలి వెంకన్న

మిర్యాలగూడ, డిసెంబర్ 30: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో 'రూరల్ క్రికెట్ అన్ గ్లోబల్ వికెట్' నినాదంతో 'తెలంగాణ గోల్డ్‌కప్ 2025' క్రికెట్ టోర్నమెంట్ మిర్యాలగూడలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సౌత్‌జోన్ కోఆర్డినేటర్ కావలి వెంకన్న తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజేత జట్టుకు రూ.50వేలు, ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ.25వేలు, ట్రోఫి అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నల్లగొండ జిల్లా క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9573377729, 9989168171 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పోతుల నరేందర్, తీపిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కోచ్ రాజు, గౌరు రాజీవ్ పాల్గొన్నారు.

శాంతియుతంగా న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలి

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబర్ 30: న్యూఇయర్ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు కోరారు. సోమవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31న ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, పోలీసు వారి సూచనలు పాటించాలన్నారు. మద్యం దుకాణాలు, వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు సమయపాలన పాటించాలన్నారు. 31న రాత్రి 10 నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ టెస్టింగ్ కిట్ల ద్వారా కూడా తనిఖీలు చేస్తామన్నారు. అక్రమ సిట్టింగ్‌లు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులుగా తిరగడం, మహిళలను వేధించడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో అకారణంగా రోడ్లపై తిరుగుతున్న 40 మందిని పట్టుకొని వారి నుంచి 25 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 18పై కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో సీఐలు నాగార్జున, కరుణాకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

- బీఆర్ఎస్ నాయకుడు కట్టా మల్లేశ్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న కట్టా మల్లేశ్‌గౌడ్

వేములపల్లి, డిసెంబర్ 30: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు రైతులకు రైతు భరోసా అందించలేదన్నారు. రెండు సీజన్ల డబ్బులను ఒకేసారి విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రూ.2లక్షల రుణమాఫీ కేవలం 40 శాతం మంది రైతులకే అందిందని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కౌలు రైతుకు ఎకరానికి రూ.15వేలు అందించాలని, భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లను పెంచాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాత్రగడ్డ రాజగోపాల్‌రావు, నాయకులు పెదపంగ సైదులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న ఐద్వా కమిటీ సభ్యులు

మిర్యాలగూడటౌన్, డిసెంబర్ 30: జిల్లాలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రతి గ్రామానికి బస్సు వెళ్లేలా చూడాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలబోయిన వరలక్ష్మి, సహాయ కార్యదర్శి పాదూరు గోవర్దన కోరారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేసి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మనుల అరుణ, కంచర్ల ఊర్మిల, టౌన్ కమిటీ సభ్యురాలు ఒగోటి పూలమ్మ, మండల కార్యదర్శి ధరావత్ మంగ, పల్లవి పాల్గొన్నారు.

వ్యాపారవేత్త అంతయ్యకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నకిరేకల్, డిసెంబర్ 30 : నకిరేకల్‌కు చెందిన వ్యాపారవేత్త గుర్రం అంతయ్య సతీమణి శకుంతల అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారి ఇంటికి వెళ్లి శకుంతల మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పెండెం సదానందం, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేశ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, డిసెంబరు 30: పట్టణంలోని పలు ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ల మర్మతులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజారు, మాన్యంచెల్కలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

తొలగిన రోడ్డు వెంట చెత్త

ఆకారంలో చెత్తను తొలగించడంతో శుభ్రంగా కన్పిస్తున్న రోడ్డు

శాలిగౌరారం, డిసెంబర్ 30 : ఆకారం గ్రామంలో రోడ్డు వెంట వేసిన చెత్తను గ్రామ కార్యదర్శి విజయ్ సోమవారం సిబ్బందితో లొలగించి శుభ్రం చేయించారు. రోడ్డు వెంటే చెత్త వేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నమస్తే తెలంగాణ 'వికారంగా ఆకారం' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి జేసీబీ సాయంతో చెత్తను తొలగించి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ఉండాలి

- తాసీల్దార్ వెంకటేశ్వర్లు

గ్రామసభలో మాట్లాడుతున్న తాసీల్దార్ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లిచ, డిసెంబర్ 30 : రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని తాసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని అక్కెనపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. దళితులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అంటరానితనం, బాల్యవివాహాలు, కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, పంచాయతీ కార్యదర్శి జానకమ్మ, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

గడ్డం జాన్‌రెడ్డి(ఫైల్)

మాడ్గులపల్లి, డిసెంబర్ 30: మండలంలోని కొత్తగూడెం శివారులో ఆదివారం రాత్రి బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో కొత్తగూడెం మాజీ సర్పంచ్ గడ్డం జాన్‌రెడ్డి(40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డం జాన్‌రెడ్డి, కొండా సైదులు బైక్‌పై తన వ్యవసాయ భూమికి వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి గ్రామంలోకి వెళ్లేందుకు బైక్‌పై రోడ్డును దాటుతుండగా మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. గాయపడిన సైదులుకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జాన్‌రెడ్డి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జాఫర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంత్రి నివాళి

విషయం తెలుసుకున్న జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం కొత్తగూడెం గ్రామానికి వచ్చి జాన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి గుత్త మౌనిక, భర్త: గుత్త నరేందర్‌రెడ్డి, నివాసం: ఇం.నెం. 2-54, బ్రాహ్మణవెల్లెమ్ల గ్రామం, నార్కెట్‌పల్లి మండలం, నల్గొండ జిల్లా వారు తహశీల్దార్ & జాయింట్ సబ్-రిజిస్ట్రార్, అనుముల సమక్షంలో రిజిస్టర్ అయిన, కుపాస్‌పల్లి గ్రామం, అనుముల మండలం, నల్గొండ జిల్లా వద్ద గల సర్వే నెం. 100/2-1లో ఎక. 1-14 గుంటలు మరియు సర్వే నెం. 100/2-2లో ఎక. 1-13 గుంటలు, మొత్తం ఎక. 2-27 గుంటల విస్తీర్ణపు వ్యవసాయ భూమికి చెందిన 10-03-2023 తేదీగల డాక్యుమెంట్ నెం. 184 ఆఫ్ 2023 కలిగిన ఒరిజినల్ సేల్‌డీడ్ మరియు సర్వే నెం. 100/2-3లో ఎక. 1-13 గుంటల విస్తీర్ణపు వ్యవసాయ భూమికి చెందిన 10-03-2023 తేదీగల డాక్యుమెంట్ నెం. 187 ఆఫ్ 2023 కలిగిన ఒరిజినల్ సేల్‌డీడ్ 22-12-2024న తన ఇంటి సమీపాన జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా పోయినది మరియు ఎంతవెతికిననూ దొరకలేదు. అందువల్ల, ఎవరికైనా సదరు ఒరిజినల్ సేల్‌డీడ్స్ దొరికినచో నా క్లయింటుకు లేదా నాకు తిరిగి అప్పగించగలరు. ఎవరైనా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను దుర్వినియోగం చేసినచో వారు భూ చట్టం క్రింద ప్రాసిక్యూట్ చేయబడతారు/శిక్షించబడతారని తెలియజేయడమైనది మరియు సదరు లావాదేవీలకు నా క్లయింట్ బాధ్యత వహించరు మరియు వాటికి ఆమె కట్టుబడి ఉండరు.

M/s. హేమంత్ ప్రవీణ్ కుమార్
అడ్వకేట్ & అసోసియేట్స్
డి.నెం. 4-7-340, రాఘవేంద్ర నగర్, హయత్‌నగర్, హైదరాబాద్-501 505, ఫోన్ నెం. 9396489059 / 9985973333.
తేది: 26-12-2024

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

చండూరు, డిసెంబర్ 30: అంగడిపేట 5వ వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు పనస లింగస్వామి గౌడ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ మునవ్వర్ అలీకి వినతిపత్రం అందించారు. డ్రైనేజీలో చెత్త నిండిపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమల బెడద అధికమైందని, దాంతో వార్డు ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఆయన వెంట బోయపల్లి సతీశ్, వీరమల్ల స్వామి, సాయి కుమార్, వెంకన్న ఉన్నారు.

గుండ్రాంపల్లి గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

చిట్యాల, డిసెంబర్ 30 : హైదరాబాద్‌లో నిర్వహించిన బుక్ ఫెయిర్‌కు వితరణగా వచ్చిన పుస్తకాల నుంచి 250 పుస్తకాలను నిర్వాహకులు సోమవారం గుండ్రాంపల్లి గ్రంథాలయానికి అందించారు. బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ గుండ్రాంపల్లి గ్రంథాలయం అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌కు వీటిని అందించారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు, కోశాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు రూ. లక్ష విరాళం

కొండమల్లేపల్లి, డిసెంబర్ 26 : మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ వేదం అంజనేయశాస్త్రి తన భార్య అరుణ జ్ఞాపకార్థం సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు లక్ష రూపాయాల విరాళాన్ని అందించారు. వాటిలో ఎఫ్‌డీ చేసి వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం 9వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, సీహెచ్ కృష్ణయ్య, జానునాయక్, సైదానాయక్, నర్సింహ, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ-2గా వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 30 : మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ రెండో ఎస్ఐగా సీహెచ్.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన కొత్తవారు సంచరించినా, అనుమానితులు కనిపించినా సమాచారం ఇవ్వాలని కోరారు.

కనగల్ పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

కనగల్ జడ్పీహెచ్ఎస్‌కు కంప్యూటర్‌ను బహూకరిస్తున్న బోసిపాక కోటిరెడ్డి, గుండా ఆనంద్

కొబ్బరి కాయల వేలం వాయిదా

- వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువకే వేలం

నల్లగొండ సిటీ, డిసెంబరు 30 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి సోమవారం నల్లగొండలోని దేవదాయ సహాయ కమిషనర్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయితే టెండర్లలో తిరుమలగిరికి చెందిన ఎం.సోమయ్య అందరికంటే ఎక్కువగా రూ.65.30 లక్షలకు కోడ్ చేశాడు. అయితే గతంలో వచ్చిన దానికంటే ప్రస్తుతం తక్కువ ధరకు కోడ్ చేయడంతో టెండరును వాయిదా వేశారు. అయితే వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కోడ్ చేస్తుండడంతో ఇప్పటికే 6 సార్లు వేలం పాటలు రద్దు చేశారు. గతంలో రూ. 83 లక్షలకు టెండరు పలకగా ఈ సారి తక్కువగా కోడ్ చేస్తుండడంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వారి ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం ఈఓ తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమతి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, నగేశ్, యాదగిరి, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాటూరు సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని వినతి

త్రిపురారం, డిసెంబర్ 30: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని మాటూరు గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని పలువురు గ్రామస్తులు సోమవారం డీఎల్‌పీఓ, ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. గ్రామంలో ఎస్టీ తరువాత అత్యధిక ఓట్లు ఎస్సీలకే ఉన్నాయని, అయినా ఇప్పటివరకు ఎస్సీకి రిజర్వ్ కాలేదని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో కలకొండ శ్రీనివాస్, మడుపు అభిరాం, శివశంకర మల్లయ్య, నాగయ్య, పెదమల్లయ్య, వడ్డె ఏసు, లచ్చయ్య, ఇస్రం నాగరాజు, ఉదయ్‌కిరణ్ ఉన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల అరెస్ట్

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

నందికొండ, డిసెంబర్ 30 : హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బీసన్న తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెద్దవూర మండలం నయనవాని కుంట గ్రామానికి చెందిన మేకల పవన్‌కు, అనుముల మండల కొత్తపల్లి గ్రామానికి చెందిన మేకల సతీశ్‌కు ఈ నెల 23న హాలియాలో ఒక పంచాయితీ విషయంతో గొడవ తలెత్తింది. గొడవను మనుసులో పెట్టుకున్న సతీశ్ తన స్నేహితులు రామకృష్ణ, మోతమారి కోటేశ్, కనకరాజు, దుగ్యాల మహేందర్‌తో కలిసి పవన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని పథకం వేశాడు. అదే రోజు సాయంత్రం పవన్‌కు ఫోన్ చేసి ముసలమ్మ చెట్టు వద్దకు రప్పించాడు. పథకం ప్రకారం సతీశ్‌తో పాటు అతడి స్నేహితులు పవన్‌పై కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. స్థానికుల సమాచారంతో పెద్దవూర ఎస్ఐ అక్కడికి చేరుకోగానే నిందితులు పారిపోయారు. పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ విచారణ చేపట్టారు. ఆదివారం సతీశ్ తన స్నేహితులతో కలిసి కారులో ఆంధ్రాకు పారిపోతుండగా పట్టుకొని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

గ్రామాల్లో ఫార్మా కంపెనీలు పెడితే ఉద్యమం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

గ్రామ సభలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు, డిసెంబర్ 30 : కాలుష్యం వెదజల్లే ప్రైవేటు ఫార్మాకంపెనీలు, కోళ్ల పరిశ్రమలను వ్యసాయ భూముల్లో ఏర్పాటు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మండలంలోని కోతులారం గ్రామంలో కోళ్ల పరిశ్రమ ఏర్పాటుపై గ్రామ ప్రత్యేకాధికారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కోళ్లఫాం ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ చెడు వాసనలు వెదజల్లే కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని, కొద్ది మంది వ్యాపారుల ప్రయోజనాల కోసం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడొద్దని అన్నారు. గ్రామాల్లో విషాన్ని వెదజల్లే ఫార్మా కంపెనీలు, కోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తాము వ్యతిరేకిస్తామని, పేదల ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు వట్టికోటి శేఖర్, గ్రామ కార్యదర్శి బాబు, జాజుల పారిజాతాసత్యనారాయణ, జక్కలి లోకేశ్, జాజుల వెంకటేశ్, గురిజ నర్సింహగౌడ్, జాల బచ్చిప్రసాద్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.